క్లుప్తంగా

ఈవీఎంల కేటాయింపు



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నెల్లిమర్ల: ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల శిక్షణ కోసం ఈవీఎంల కేటాయింపు జరిగింది. స్థానిక ఈవీఎం గోదాముల్లో ఈ కార్యక్రమాన్ని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం నిర్వహించారు. ఒక్కో నియోజకవర్గానికి పది ఈవీఎం మిషన్లను అందించనున్నారు. వీటిలో ఐదు ఈవీఎంలను అసెంబ్లీ ఎన్నికలకు, మరో ఐదు మిషన్లను పార్లమెంటు ఎన్నికలకు శిక్షణ కోసం వినియోగిస్తారు. వీటి ద్వారా ఎన్నికల అధికారులకు ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎంవీ. సూర్యకళ, ఈవీఎంల నోడల్ అధికారి బి.ఉమాశంకర్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రభాకర్, నెల్లిమర్ల తహసీల్దార్ రామరాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సముద్రాల రామారావు, నర్సింహరావు, లెంక అప్పలనాయుడు, తాలాడ సన్నిబాబు, కె.పద్మనాభం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



ఒమ్మిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

నెల్లిమర్ల రూరల్: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలంతా సహకరించాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కేంద్ర బలగాలతో గ్రామమంతా పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఎటువంటి గొడవలు సృష్టించరాదని, ముఖ్యంగా చదువుకున్న యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో పొరపాటున ఎటువంటి కేసులు నమోదైనా భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామగణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

డెంకాడ: మండలంలోని పినతాడివాడ సచివాలయం పరిధిలోని 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శి జగదీష్‌కు బుధవారం అందజేసినట్టు ఆయన తెలిపారు.

కొండవెలగాడలో..

నెల్లిమర్ల: మండలంలోని కొండవెలగాడ గ్రామ సచివాలయం పరిధిలోని 12 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ జి.రామారావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

విజయనగరం క్రైమ్: స్థానిక సాకేటివీధిలో పేకాట, బల్లాట ఆడుతున్న వారిపై టూటౌన్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. 11మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17 వేల 380 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కోరాడ రామారావు తెలిపారు.

కోలగట్ల విజయానికి మేము సిద్ధం

- మద్దతు తెలిపిన నగర ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్స్



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

విజయనగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో విజయనగరం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విజయానికి తాము సిద్ధమంటూ విజయనగరం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు 60 మంది కోలగట్లను బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ తమకు సంఘీభావంగా ని లవడం ఆనందంగా ఉందన్నారు. స్థానికంగా నగర అభివృద్ధికి ఎమ్మెల్యేగా ఎంతగానో కృషి చేశామన్నారు. యూనియన్ అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు మాట్లాడుతూ స్థానికంగా కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై తాము మద్దతుగా నిలిచామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాయుడు సురేష్‌కుమార్, గూడూరు సూర్యారావు, దొడ్డి వీర జగన్నాథరావు, మల్ల బంగార్రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమం.. గుంకలాం సొంతం

- రూ. 80 లక్షలతో భవన నిర్మాణాలు
- రూ. 20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలు
- నాడు – నేడు నిధులు రూ.1.15 కోట్లతో పాఠశాలల అభివృద్ధి



రూ.40 లక్షలతో నిర్మించిన గుంకలాం గ్రామ సచివాలయం

విజయనగరం రూరల్: 'మాట తప్పను... మడమ తిప్పను', 'నేను విన్నాను... నేను ఉన్నాను' అన్న మాటలను నిజం చేస్తూ 58 నెలల్లో పేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. ఏ గ్రామం చూసినా... ఏ పేదింటిని కదిపినా నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధే కళ్లకు కనిపిస్తుంది. గ్రామాల అభివృద్ధికి, సంక్షేమానికి కోట్లాది రూపాయల నిధులను వెచ్చించంచడంతో పల్లెల రూపురేఖలు మారిపోయాయి. విజయనగరం మండలం గుంకలాం గ్రామ సచివాలయం అభివృద్ధి పథాన అందనంత ఎత్తులో నిలవడంతో జననేతకు ప్రజలు జేజేలు వలుకుతున్నారు. 58 నెలల్లో సంక్షేమ పథకాలకు రూ.32 కోట్లను నేరుగా లబ్ధిదారులకు అందించగా, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.2.2 కోట్ల నిధులను మంజూరు చేశారు.

రూ.80 లక్షలతో భవన నిర్మాణాలు

గుంకలాంలో సచివాలయ భవన నిర్మాణానికి రూ.35 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని కార్పొరేట్ హంగులతో నిర్మించారు. రైతుల ప్రయోజనాలకు రూ.23.94 లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మించగా, 24 గంటలు ఇంటింటికీ వైద్యం అందించాలనే ఆశయంతో రూ.20.80 లక్షలతో వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించారు.

అన్ని వీధులకు సీసీ రోడ్లు, కాలువలు

గుంకలాం గ్రామంలో ఏ వీధి చూసినా కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లతో అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో గ్రామంలో అన్ని వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.23 లక్షలు మంజూరు చేయడంతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు.

పేదల సంక్షేమానికి రూ.32 కోట్లు

గుంకలాం గ్రామంలో అర్హులైన లబ్ధిదారుల సంక్షేమ పథకాలకు 58 నెలల కాలంలో రూ.23.82 కోట్ల నిధులను మంజూరు చేశారు. వైఎస్సార్ పింఛను కానుకకు సుమారు రూ.8 కోట్లు అందించగా, గృహ నిర్మాణాలకు రూ.2 కోట్లు, వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.4.10 కోట్లు, వైఎస్సార్ చేయూత పథకానికి రూ.2.1 కోట్లు, జగనన్న అమ్మ ఒడి పథకానికి రూ.2.64 కోట్లు, వైఎస్సార్ ఆసరా రూ.2.44 కోట్లు, ఇతర పథకాలకు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. అలాగే డీబీటీ, నాన్ డీబీటీ పథకం కింద రూ. 7.41 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగింది.

రూ.1.15 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెండు ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి నాడు – నేడు పథకం కింద ఎంపిక చేసి రూ.1.15 కోట్ల నిధులను మంజూరు చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.77.87 లక్షలను మంజూరు చేయగా, మండల పరిషత్ పాఠశాల అభివృద్ధికి రూ. 37.13 లక్షల నిధులను మంజూరు చేశారు. దీంతో పాఠశాలల ఆవరణలో తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, రన్నింగ్ వాటర్ సదుపాయం, విద్యుత్ సౌకర్యం, రక్షిత తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాఠశాలలు కార్పొరేట్ స్థాయిని సంతరించుకున్నాయి.



కార్పొరేట్ స్థాయి వసతులతో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణం



గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు



నాడు- నేడు నిధులతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల

అభివృద్ధే అజెండా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సదాశయానికి తోడు స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో 58 నెలల కాలంలోనే గ్రామ అభివృద్ధికి కృషి చేశాం. స్థానిక ప్రజా ప్రతినిధులు సహకారం తోడై ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. గ్రామ సచివాలయ పరిధిలోనే సంక్షేమం, అభివృద్ధికి సుమారు రూ.34 కోట్లు ఖర్చు చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది.

– కునుకు వెంకటరావు, సర్పంచ్, గుంకలాం గ్రామం

తమ్ముడిలా ఆదుకుంటున్నాడు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారమే నాకు ప్రతీ ఏడాది చేయూత పథకం కింద రూ.18,500 అందిస్తున్నారు. దీంతో కూలీ, నాలీ చేసుకున్న డబ్బులుతో పాటు చేయూత డబ్బులు కుటుంబ పోషణకు సరిపోతున్నాయి. మమ్మల్ని అన్ని విధాలా ఆదుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము అండగా ఉంటాం.

– సుంకరి రామలక్ష్మి, లబ్ధిదారు, గుంకలాం

అమ్మ ఒడితో పిల్లలను చదివించుకున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకంలో భాగంగా అమ్మ ఒడి పథకాన్ని మంజూరు చేశారు. దీంతో మా పిల్లలను ఉన్నతంగా చదివించుకున్నాం. వీటితో పాటు పాఠశాలను అభివృద్ధి చేయడంతో పిల్లలు చదువుపై శ్రద్ధ చూపుతున్నారు. సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– కునుకు కాంత, అమ్మ ఒడి పథకం లబ్ధిదారు, గుంకలాం

ప్రజలే కూటమిని మడత పెడతారు



పాత కొప్పెర్లలో ప్రచార ర్యాలీలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, రఘుబాబు తదితరులు

- ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ : సార్వత్రిక ఎన్నికలలో ఉమ్మడి కూటమిని ప్రజలే మడత పెడతారని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పాతకొప్పెర్ల, కొత్తకొప్పెర్ల, మత్స్యవానిపాలెం గ్రామాలలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, యువత బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో చేకూరిన లబ్ధిపై ఇంటింటికి వెళ్లి వివరించి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేసే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీయేనని స్పష్టం చేశారు. జన బలం ఉన్న జగనన్నను ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు కూటమిగా జతకట్టాయని, టీడీపీ జనసేన బీజేపీ కలిసి ఎన్నికలలో పోటీ చేసినా ప్రజలు విశ్వసించడం లేదన్నారు. కూటమి పార్టీలు పేదలు సంక్షేమాన్ని అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నాయన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, పుప్పాల లక్ష్మీనారాయణ, చిక్కాల సాంబశివరావు, లంకలపల్లి రాజారావు, బొల్లు రమేష్, పడాల భానుప్రకాశరావు, బావిశెట్టి నారాయణరావు, ఇనకోటి నాగబాబు, దాడిశెట్టి త్రినాధరావు, వాల్లె సన్యాసినాయుడు, తాటిశెట్టి బాబు, పైడి మధు, గుజ్జు సురేష్ రెడ్డి, పడాల శ్రీధర్, రౌతు శ్రీరాంమూర్తి, దాడిశెట్టి గోవింద, బొడ్డు ఎల్లాజీ, దేశెట్టి గణేష్, రౌతు సాయికుమార్, శాంతాటి శ్రీనివాసరావు, కోట్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

ఓటును వినియోగించుకోవాలి

పూసపాటిరేగ : ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పూసపాటిరేగ ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు సూచించారు. మండలంలోని చల్లవానితోట, గొల్లపేట గ్రామాలులో ఎన్నికల నియమావళిపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించరాదన్నారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సమస్యాత్మక గ్రామాలను ఇప్పటికే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా మండలంలోని ఏపీఎస్‌పీ బెటాలియన్ పరిధిలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ జి.సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ విద్యుత్‌ను నిలిపివేస్తామని పేర్కొన్నారు. కృష్ణాపురం, రఘుమండ, జొన్నాడ, దువ్వపేట, గొలగాం, ఆకులపేట, డి.తాళ్ల వలస గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోగులకు సంతృప్తిగా భోజనాలు



భోగాపురం సీహెచ్‌సీ

పూసపాటిరేగ : భోగాపురం సీహెచ్‌సీలో రోగులకు సంతృప్తిగా భోజనాలు అందిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మెనూలో సమూలమైన మార్పులు తీసుకువచ్చి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి పూట భోజనం అందిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డైట్ చార్జీలు 40 రుపాయిలుంటే, ప్రస్తుతం 100 రుపాయిలకు పెంచారు. దీంతో రోగులకు నాణ్యమైన పోషక ఆహారాన్ని అందిస్తున్నారు. భోగాపురం సీహెచ్‌సీలో నిత్యం 30 మంది రోగులకు ఆహారం సరఫరా చేస్తున్నారు. ఉదయం ఇడ్లీ, మధ్యాహ్నం అన్నం, సాంబారు, కూర, గుడ్డు, అరటి పండు, మజ్జిగ, రాత్రిపూట రోగులకు అన్నం, సాంబారు, గుడ్డు, మజ్జిగ ఇస్తున్నారు. సీహెచ్‌సీలో సక్రమంగా వైద్య సేవలు అందించడంతో పాటు రుచికరమైన ఆహారం అందిస్తున్నారు.

ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీకే..



ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఎవరెన్ని తప్పుడు ఆరోపణలు చేసినా... కూటమి కట్టి వచ్చినా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు ఉంటుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. గడిచిన 5 ఏళ్ల ప్రజల కష్ట, సుఖాలను పట్టించుకోని ప్రతిపక్ష టీడీపీ నాయకులు నేడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడపుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని నీతిమాలిన రాజకీయాలు చేసిన ప్రజలు ఇచ్చే అంతిమ తీర్పు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. నగరంలోని గాజులరేగ ప్రాంతం రాళ్లవీధిలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం బుధవారం నిర్వహించారు. రానున సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లంచగొండితనం లేకుండా పాలన సాగడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతం కంటే మెరుగైన పాలన అందిందని, మరల మరో సారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని ప్రజలు చెప్పటం ఉత్సాహంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రశాంతమైన విజయనగరంలో ఆరోపణలు చేసే వారు రుజువులు, సాక్ష్యాలతో చేయాలని హితవు పలికారు. కేవలం తనను చెడుగా చిత్రీకరించేందుకు చేసే ప్రయత్నాలను ప్రజలు నమ్మరని, ప్రజలు కూడా ఏ పార్టీకి ఓటు వేసినా పర్వాలేదని, తప్పుడు ఆరోపణలు నమ్మి నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల ప్రజలంతా విని వాస్తవాలను తెలుసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గడిచిన 5 ఏళ్లలో 70 శాతంకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మరోసారి అవకాశం కల్పిస్తే సమస్యలు లేని విజయనగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలను నమ్మే పరిస్థితిలో లేరని, గడిచిన 5 ఏళ్లలో బంగ్లాల్లో కూర్చున్న వారు ఎన్నికల్లో పబ్బం గడుపుకునేందుకు ప్రయతిస్నిస్తున్నారని దుమ్మెత్తిపోశారు. కార్యక్రమంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, కార్పొరేటర్లు పట్టా ఆదిలక్ష్మి, కంటుభుక్త తవిటరాజు, కనకల నాగవల్లి, పార్టీ నాయకులు బోడసింగి ఈశ్వరరావు, జమ్మాన శ్రీనివాసరావు, జమ్ము మధు తదితరులు పాల్గొన్నారు.

'సోల్జర్స్' చేయూత

విజయనగరం: ప్రమాదవశాత్తు ఇంటి పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబానికి అండగా నిలిచిన చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ ఇటీవల గరివిడి మండల కేంద్రంలో నివసిస్తూ ఓ గ్యారేజ్‌లో పని చేస్తున్న పెంటిమాని గోపి టైర్ బ్లాస్ట్ అయి చనిపోవటంతో ఆ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచింది. విషయం తెలుసుకున్న చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సిరిసహస్ర చనిపోయిన వ్యక్తి భార్య దేవి, పిల్లలు అభిరామ్, లోకేష్‌లకు బుధవారం ధర్మపురిలోని క్యాంప్ కార్యాలయంలో రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఇటువంటి వారిని ఆదుకోవటం తమ బాధ్యతగా భావిస్తున్నామని సిరిసహస్ర పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఈ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తమ సోల్జర్స్ సంస్థ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు.



నిరుపేద కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెబుతున్న సిరిసహస్ర

సెంచూరియన్ స్కాలర్‌కు పీహెచ్‌డీ ప్రదానం



రమేష్ వర్మకు డాక్టరేట్ పత్రాన్ని అందజేస్తున్న వీసీ మహంతి, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఈసీఈ విభాగం స్కాలర్ రమేష్ వర్మకు వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి బుధవారం పీహెచ్‌డీ ప్రదానం చేశారు. బయోమెడికల్ విభాగం వర్మ చేసిన పరిశోధన అంశానికి గానూ పీహెచ్‌డీను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పల్లవి, డీన్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

21న ప్రవేశ పరీక్ష

విజయనగరం పూల్‌బాగ్: పూల్‌బాగ్‌లోని అయ్యప్ప నగర్‌లోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి సంబంధించి 643 దరఖాస్తులు వచ్చినట్లు ప్రిన్సిపాల్ రుక్సానా ఫర్వీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారంతా స్కూల్‌కి అప్లికేషన్ హార్డ్ కాపీ, విద్యార్థి ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్ జెరాక్స్ కాపీలతో స్కూల్‌కి అందజేయాలన్నారు. ఈ నెల 21న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు తమహాల్ టిక్కెట్‌లను https://apms.apcfss.in/studentLogin.do వెబ్ సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

ఇంటింటి ప్రచారానికి ముందస్తు సమాచారం ఇవ్వాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఇంటింటి ఎన్నికల ప్రచారం, కరపత్రాల పంపిణీ గురించి ముందుగా సంబంధిత పోలీసు స్టేషన్లో సమాచారం ఇస్తే సరిపోతుందని, ప్రత్యేకంగా వీటి కోసం అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నుంచి తాజాగా వచ్చిన మార్గదర్శకాలను వివరించారు. ఇంటింటి ప్రచారానికి, కరపత్రాల పంపిణీకి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని గతంలో నిబంధన ఉండేదని, రాజకీయ పార్టీల విజ్ఞప్తి మేరకు దీనిని సవరించడం జరిగిందని తెలిపారు. ఎక్కడ సమావేశాలను, ర్యాలీలను నిర్వహించినా, సంబంధిత ఆర్‌ఓ నుంచి ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి మరో నాలుగు రోజులు మాత్రమే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే, వచ్చే ఎన్నికల్లో ఓటు వేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 2.12 లక్షల మందికి ఓటరు గుర్తింపు కార్డులను పంపించడం జరిగిందన్నారు. సుమారు 6వేల కార్డులు వారి చిరునామాలకు చేరకపోవడంతో తిరిగి వచ్చాయని, వాటిని బీఎల్‌ఓల ద్వారా ఆయా ఓటర్లకు అందించడానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. జేసీ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, నర్సింహరావు, రెడ్డి శంకరరావు, సోములు పాల్గొన్నారు.

వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేయాలి : ఎస్పీ



మోదవలస చెక్‌పోస్టు వద్ద పోలీస్ అధికారులు, కేంద్ర బలగాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

డెంకాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ ఎం.దీపికా ఆదేశించారు. విజయనగరం – విశాఖ జాతీయ రహదారిపై మండలంలోని మోదవలస వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఎస్పీ దీపిక బుధవారం సందర్శించారు. చెక్ పోస్టు వద్ద పోలీస్ అధికారులు, కేంద్ర బలగాలు నిర్వహిస్తున్న వాహన తనిఖీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక మాట్లాడుతూ పరిమితికి మించి నగదు పట్టుబడితే సీజ్ చేయాలన్నారు. ఓటర్లు ప్రలోభ పెట్టే గిఫ్ట్స్, మద్యం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. గంజాయి వంటి రవాణాను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, భోగాపురం సీఐ బి.వెంకటరావు, డెంకాడ ఎస్‌ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.